# అఖిల



"నిన్న డిబేటింగ్‌లో నీవు పాల్గొని ఉంటే బాగుండేది, అఖిలా! నీవు పాల్గొని ఉంటే ఫస్ట్ ప్రైజ్ ఆ ప్రసాద్‌కి వచ్చి ఉండేది కాదు" అన్నది పార్వతి.

"పోనిద్దూ" అన్నది అఖిల.

"పోనివ్వటమేమిటే! ప్రతిసారీ ఫస్ట్ ప్రైజ్ సంపాదించే నీవు అసలు పాల్గొనక పోవటమేమిటి?"

"అది కాదు,పార్వతీ!కొన్ని విషయాలు జనరల్‌గా మాట్లాడుకునేవి, ఆత్మ విమర్శ చేసుకోవలసినవి ఉంటాయి. కొన్ని విషయాలు స్టేజీ మీద వాక్చాతుర్యం కాకుండా ఆచరించి చూపవలసినవి ఉంటాయి. ఈ వరకట్నం విషయం కూడా అంతే.తీసుకోకుండా ఉండటమూ, ఇవ్వక పోవటమూ ఆచరించాలి తప్ప వేదిక లెక్కి వాదనలు చేసి ఏం ప్రయోజనం? అందుకే నేను మాట్లాడ లేదు."

"అంటే, నీ వివాహానికి కట్నం ఇవ్వనివ్వవా?" అన్నది పార్వతి నవ్వుతూ.

"అవును. ఇవ్వనివ్వను" అన్నది దృఢంగా.

అఖిల కంఠంలోని దృఢత్వానికి చకితురాలయింది పార్వతి.

"నిజంగా అంటున్నావా, అఖిలా? అలా అయితే ఈ జన్మలో నీ వివాహం జరగగలదా? శక్తి ఉన్నంతలో కట్నం ఇస్తామంటున్నా ఈ రోజుల్లో ఆడపిల్ల పెండ్లి జరగటం లేదు. మా అక్క సంగతి చూచావుగా?" అన్నది పార్వతి బాధగా.

"నా వివాహం జరగనీ, జరగక పోనీ, ఏమైనా కానీ, నా నిర్ణయం మారదు. ఈ విషయం మా నాన్నగారికికూడా స్పష్టంగా చెప్పాను. ఆయన ఒప్పుకున్నారుకూడా. మా నాన్న మాట తప్పేవారు కాదు" అని తరవాత మాట మార్చి వేసింది అఖిల.

అఖిలేశ్వరి తండ్రి యూనివర్సిటీలో పని చేస్తున్నాడు. కావటం ఎమ్. ఎ. అయినా మిత సంతానం, పొదుపు కలవాడవటం వలన ఆస్తి సంపాదించలేకపోయినా, అప్పు చేయకుండా సంసారం సాగిస్తున్నాడు. పల్లెటూరులో ఉన్న పొలం అమ్మివేసి, వైజాగ్‌లోనే మంచి డాబా కొన్నాడు. ఒక పోర్షన్ అద్దెకు ఇచ్చి, మరొక పోర్షన్‌లో తాను ఉంటున్నాడు. అతనికి ముగ్గురు కూతుళ్ళు. పెద్ద పిల్ల అఖిలేశ్వరి. బి. ఎ. చదువుతున్నది. స్వాభిమానమూ, చురుకుతనమూ, వివేకమూ, నిర్దుష్టమైన ప్రవర్తనా కల అఖిల అంటే తల్లిదండ్రులకు ప్రాణం. కాలేజీ లోనూ, బయట కూడా తెలిసిన ప్రతి ఒక్కరి నుండి ప్రత్యేకమైన అభిమానం, గౌరవం సంపాదించుకున్నది అఖిల. ఎంత వినయశీలి అయినా, తన అభిమానానికి దెబ్బ తగిలినప్పుడు అంత నిష్కర్షగానూ మాట్లాడేయ గలగడం, ధర్మమని తాను నమ్మినదానిని నిర్భయంగా ఆచరించటం ఆమె స్వభావం.

అఖిల ఇంటికి వచ్చిన తరవాతకూడా ఒకటి, రెండు సార్లు పార్వతి అన్న మాటలు గుర్తుకు వచ్చాయి. శక్తి ఉన్నంతలో కట్నం ఇస్తామన్న ఆడపిల్ల వివాహం సులభంగా జరగని మాట వాస్తవమే. దీనికి కారణం ఏ విధంగానైనా సరే త్వరలో ఇల్లాలు కావాలి అన్న యువతుల కోరిక, ఆడపిల్లంటే ఏదో బరువుగా భావిస్తూ, ఏదో విధంగా ముందు పెండ్లి చేసి పంపివేయాలన్న తలిదండ్రుల తొందర అని తన భావన. ఇవి చాలా సహజమైనవే అయినా, కాలానుగుణంగా కొంత దృఢ సంకల్పంతో వేగిరపడకుండా ఈ మూఢాచారాన్ని తొలగించాలి అని తన ఉద్దేశ్యం. ఇలా ఏదో ఆలోచిస్తూనే బీచ్‌కి వచ్చి కూర్చున్నది అఖిల.

రోజూ కాలేజీ నుండి రాగానే బీచ్ వచ్చి కొంచెం సేపు కూర్చుని వెళ్ళటం అఖిలకు అలవాటు. బీచ్ వాళ్ళ ఇంటికి చాలా సమీపం కావటం వలన ఈ అలవాటు తెలియకుండా అయిపోయింది. రోజూ చూస్తూనే ఉన్నా, ఈ అనంత వారాశి ఆమెకు నిత్య నూతనంగాఉంటూనే ఉంటుంది. సాయంకాలపు వేళలో నీలిరంగు సముద్రం, అలల కొసలలో పాల నురుగు లాంటి నురుగు, పైన నీలాకాశం, దానిమీదకూడా తెల్లని దూదిపింజల వంటి మబ్బులు, చెదిరి చెదిరి మనుషులు, ఇసుకలో ఆడుతూన్న చిన్నారి పాపలు, నన్నటి సంగీతంతో ట్రాన్సిస్టర్లు, చల్లటి గాలి—వాతావరణం ఆహ్లాదంగా ఉన్నది. గాలికి ఎగిరే ముంగురుల్ని సవరించుకుంటూ చుట్టూ చూస్తున్నది అఖిల. కొంచెం దూరంలో

ఒక యువకుడు తన వైపు రావటం గమనించింది.

'అరె... ప్రసాద్!' అనుకున్నది చిన్నగా. అందమూ, ఆరోగ్యమూ పోటీ పడుతూ ఉండగా తెల్లటి దుస్తులలో పిరెండలో మెరిసిపోతున్నాడు ప్రసాద్. ఆకర్షణీయమైన వ్యక్తి అనుకున్నది అఖిల. కాలేజీలో అతనూ బి. ఎ. చదువుతున్నాడు. తన క్లాస్‌మేట్. తమ క్లాస్‌లో తనతో పోటీ చేయుగల వాడు అతనొక్కడే. సాధారణంగా మార్కులలో కాని, ఏక్టివిటీస్‌లో కాని తను ఫస్టు, అతను సెకండ్ రావటం జరుగుతూ ఉంటుంది. నిర్మలమైన నవ్వుతో ఒక్కసారి "కంగ్రాచ్యులేషన్స్" అని వెళ్ళిపోతుంటాడు.

నిన్న డిబేటింగ్ గుర్తు వచ్చింది. మాట్లాడవలసిన విషయం 'వరకట్నం' అని తెలియపరచగానే తాను విరమించుకున్నది. తను మాట్లాడటానికి లేవక పోవటంతో అతని ముఖంలోని ఆశ్చర్యం లిప్త పాటుదే అయినా, తాను గ్రహించింది. అతను ఫస్ట్ వచ్చినట్లు ప్రకటించినప్పుడు ఏదో మాట్లాడుతూ అతనికి అభినందనలు తెలుపకుండానే తాను వచ్చేసింది. ప్రతిసారి అతను అభినందిస్తూ ఉండగా, ఈ ఒక్క సారీ తాను అభినందనలు తెలుపక పోవటం అసభ్యంగా తోచి అతను ఏమనుకున్నాడో అనుకున్నది.

మొన్నటి రోజున అతను మాట్లాడటం జ్ఞాపకం వచ్చి నవ్వుకున్నది. ఉన్న కొంచెం సమయంలోనే, "వరకట్నం తీసుకునే వారిలో గొప్ప కోసం తీసుకునే వారిని, ధన దాహంతో తీసుకునే వారిని, పరిస్థితుల ప్రాబల్యం వల్ల తీసుకునే వారిని వేర్వేరుగా సమర్థంగా నిరూపించి, యువకులుకూడా తల్లితండ్రులను ప[illegible]టమో, లేదా వారి మనస్సు [illegible]లేమనో తప్పుకుంటున్నా[illegible]నా తప్పంతా పెద్దల మీద [illegible]కుండా యువకులు ముందడుగు [illegible]ని, తండ్రులకు నచ్చ చెప్పటం [illegible], అలా వీలు కాని పక్షంలో ఏదో [illegible] యుక్తి చేతనయినా పెద్దవాళ్ళు [illegible] తెలుసుకునేటట్లు చేసి, సంఘంలో ఈ దురాచారాన్ని నిర్మూలించేందుకు యువకులు దృఢంగా సంకల్పించాలని, ఇది కేవలం తన పరోపదేశ పాండిత్యం కాదని, అటువంటి యువకులలో తానూ ఒకడినని అంటూ కరతాళ ధ్వనుల మధ్య నుండి దిగిపోయాడు.

తాను కట్నం తీసుకోనని పరోక్షంగా చెప్పాడు. 'కాని, మాటలు వేరు, చేతలు వేరు' అని ఆలోచిస్తూ తన వైపే వస్తున్న ప్రసాద్‌ను చూచి, 'అరె! నా వైపు వస్తున్నాడు' అనుకుంటూ ఆలోచనలకు అడ్డు కట్ట వేసింది.

ప్రసాద్ సమీపించి, "నమస్తే!" అన్నాడు.

అఖిలకూడా "నమస్తే" అన్నది లేచి. కాని, అతను కూర్చుంటూ తననూ కూర్చోమన్నప్పుడు కూర్చోక తప్పలేదు. నిన్నటి విషయం గుర్తు వచ్చి, "కంగ్రాచ్యులేషన్స్" అన్నది.

"థాంక్స్! అయినా, ఎందుకో తెలియలేదు" అన్నాడు కావాలని అమాయకంగా ముఖం పెట్టి.

నవ్వు వచ్చింది అఖిలకు.

"నిన్న డిబేటింగ్‌లో మీరు ఫస్ట్ వచ్చినందుకు" అన్నది.

"హాస్యమాడుతున్నారా? మీరు పాల్గొనక పోవటం వలన నాకు రావటం జరిగింది. అదికూడా గొప్ప విషయమేనా? అయినా, మీరు పాల్గొనలేదేం?" అన్నాడు ప్రసాద్.

"మీరు చెప్పిన ప్రకారం అయితే అప్పుడు మీరు సెకండ్ అయేవారు" అన్నది కొంచెం హాస్యంగా.

"ఫరవాలేదు. మీ చేతిలో నేను ఓడిపోయినా నాకు సంతోషమే" అన్నాడు ప్రసాద్.

విస్మయంతో తల ఎత్తి, అతని కళ్ళలో చిత్రమైన మెరుపు చూసి, కలవరపాటుతో కళ్ళు దించేసుకున్నది అఖిల.

"ఇంతకూ మీరు ఎందుకు మాట్లాడలేదో చెప్పనేలేదు."

"అభిప్రాయాలు ఊరికే వెలువరించి ఏం ప్రయోజనం మండీ! ఆచరించి చూపాలి అని నా ఉద్దేశ్యం. అందుకే నేను పాల్గొనలేదు."

"ఇలా పది మందిలో మాట్లాడటం కేవలం గొప్ప కోసమే ననీ, ఆచరణలో మాత్రం శూన్యమనీ మీ అభిప్రాయం అనుకుంటాను."

"సారీ! నేను మిమ్మల్ని ఉద్దేశించి అనలేదు. కాని, నిత్య జీవితంలో మాటలు వేరు, చేతలు వేరు అని బుజువవు

## ఎ. విజయలక్ష్మి

తున్నది. వాటిని రెంటినీ సమన్వయపరచాలంటే ఎంతో మనోధైర్యం కావాలి. తండ్రి కళ్ళు ఉరిమితేనో, తల్లి కన్నీళ్ళు పెట్టుకుంటేనో కట్నాని కమ్ముడు పోతున్నారు ఈ నాటి యువకులు. నిన్న కట్నం తీసుకోవటం తప్పన్న యువకులలో ఎంత మంది కట్నం తీసుకోకుండా ఉంటా రంటారు?" అన్నది కొంచెం ఉద్రేకంతో.



మాటా, మంతీ — సి. ఎ. ఇట్టన్ ( మద్రాసు – 18 )

"మీ రన్న మాటలో కొంత నిజం లేకపోలేదు. అయినా, అంతా అంతే అనటం అన్యాయమైన ఆరోపణేమో ననిపిస్తోంది. కొంత మందయినా దృఢ సంకల్పంతో ఉండకపోరు. ఆ విషయం కాలమే నిరూపిస్తుంది" అన్నాడు.

"నిజమేలెండి. అలా అయితే మంచిదే. ఇక నేను వెళతాను" అంటూ లేచింది అఖిల. ఇద్దరూ నమస్కారాలు తెలుపుకుని విడిపోయారు.

* * *

ఏ విశేషాలు లేకుండానే రోజులు దొర్లి ఫైనల్ ఎగ్జామినేషన్స్‌కూడా జరిగిపోయాయి. హాస్టల్స్‌లోనూ, విడిగా రూములలోనూ ఉంటున్న ఫైనలియర్ వాళ్ళంతా సినిమాలు చూడటాలూ, పిక్నిక్కులూ, ఆటోగ్రాఫులూ, ఫోటోలూ —వీటి హడావిడిలో నాలుగు రోజులు గడిపి పెట్టె బేడా సర్దుకుని ఇండ్లకు బయలుదేరుతున్నారు.

పరీక్ష లయినప్పటి నుండి అఖిలకూ హడావిడిగానే ఉంది. కొంచెం దూర ప్రాంతాల స్నేహితులు అరకులోయ చూద్దా మన్నారు. అంతా పది మంది కలిసి, వెళ్ళి నిన్న ఉదయమే వైజాగ్ చేరి తరవాత ఎటు వాళ్ళటు వెళ్ళిపోయారు. సాయంత్రం అయిదయింది. బీచ్‌లో కూర్చున్న అఖిలకు సముద్రపు హోరు సంగీతంలా వినిపిస్తుంటే, 'అబ్బ! ఎన్నాళ్ళో అయినట్లనిపిస్తోంది సముద్రం చూచి' అనుకున్నది. పరీక్షలు తృప్తికరంగా వ్రాయటం వల్ల మనస్సు హాయిగా, తేలికగా ఉన్నది. ఆ సంధ్యా సమయంలో సముద్రపు గాలి మనస్సుకు ఉల్లాసం కలిగిస్తూ ఉండగా, ఇసుకలో చిన్న చిన్న ముగ్గులు పెడుతూ, చెరుపుతూ కూర్చుని ఉన్నది అఖిల.

"నమస్కారమండి."

ఉలిక్కిపడి వెనక్కు తిరిగి చూచింది. ప్రసాద్ నిలబడి ఉన్నాడు. తడబడి "నమస్తే" అన్నది లేచి.

"కూర్చోండి" అంటూ తానూ కూర్చున్నాడు ప్రసాద్. క్షణం తటపటాయించి మౌనంగా తానూ కూర్చున్నది అఖిల. ప్రసాద్ సముద్రం వైపు చూస్తున్నాడు. అతని మౌనం చూచి నవ్వు, విసుగు కలిగాయి అఖిలకు. 'నన్ను కూర్చోమని ఈ మౌనముద్రేమిటి?' అనుకున్నది.

"పరీక్షలు బాగా వ్రాశారా?" అని ప్రశ్నించింది అఖిల.

"బాగానే వ్రాశాను. మీరు?"

"నేనూ బాగానే వ్రాశాను" అన్నది అఖిల.

"మీకు ఫస్ట్ క్లాస్ వస్తుంది లెండి" అన్నాడు ప్రసాద్. నవ్వి ఊరుకున్నది అఖిల.

"మీ నంబరు నా దగ్గర ఉన్నది. నా నంబర్ చెపుతాను. అయితే, నా నంబరు కోసం సెకండ్ క్లాస్‌లోనే చూడండి" అన్నాడు నవ్వుతూ ప్రసాద్.

పోయినసారి కలుసుకున్నప్పుడు అతను అన్న మాటలు గుర్తుకు వచ్చి గుండె రెండు క్షణాలు వేగంగా కొట్టుకున్నది.

మరు క్షణంలోనే తేరుకుని, "ఏం కాదు. మీకూ ఫస్ట్ క్లాస్ వస్తుంది. అది సరే. తరవాత ఏమిటి? ఎమ్.ఎ. లో చేరతారా?" అన్నది.

"లేదండి. ఇక కాలేజీకి గుడ్‌బై!" అన్నాడు ప్రసాద్.

"అరె! ఎందుకని?" అన్నది ఆశ్చర్యంగా.

"మా ఊళ్ళో మేము కొంచెం ఉన్న వాళ్ళ కిందే లెక్క. స్వంత వ్యవసాయం ఉన్నది. మా వాళ్ళకు నేను ఏకైక సంతానాన్ని. ఎంత చదివినా గుమాస్తా ఉద్యోగంకూడా రాని ఈ రోజుల్లో ఇక కాలేజీ చదువు వ్యర్థమనిపిస్తోంది. ఇంటి దగ్గరే ఉండి పొలం పనులు చూసుకుందామనుకుంటున్నాను" అన్నాడు.

"గుడ్ ఐడియా. మీ అభిప్రాయాన్ని ఆచరణలో పెట్టబోతున్నారన్నమాట!"

నవ్వి, "మీ సంగతి చెప్పనే లేదు. ఎమ్. ఎ. లో చేరతారా?" అన్నాడు.

"ఇంకా ఏమీ అనుకోలేదు" అన్నది అఖిల.

"మీ స్వభావాన్ని బట్టి ఇంకా ఆలోచించకుండా ఉండి ఉండరు. పోనీలెండి. ఇష్టం లేకపోతే బలవంతం లేదు" అన్నాడు కొంచెం చిన్నబుచ్చుకుని.

"ఇష్టం లేకపోవటం ఏముంది? బహుశా నేనూ ఇక కాలేజీలో చేరను. మా నాన్నగారి అభిప్రాయం నా వివాహం జరిపించాలని. నా అభిప్రాయాలకు గౌరవమిచ్చే వాడు లభిస్తే వివాహం చేసుకోవటం; లేదా ఉద్యోగ ప్రయత్నం" అన్నది అఖిల.

"ఐ సీ! విష్ యు ఎ హేపీ లైఫ్!" అన్నాడు ప్రసాద్.

"థాంక్స్. ఆరు కావస్తున్నది. ఇక వెళతాను" అంటూ లేచింది అఖిల.

"ప్లీజ్! కూర్చోండి. మీతో కొంచెం మాట్లాడాలని వారం రోజులుగా ప్రయాణం ఆపుకుని, ఇక్కడకు వస్తున్నాను. ఈ రోజు కలిశారు" అన్నాడు ప్రసాద్.

మనస్సులో చిరు కంపం కలిగినా, వెంటనే స్వభావ సిద్ధమైన స్వరంతో— "నాతో మాట్లాడవలసింది ఏముంటుంది? సరే, చెప్పండి" అన్నది అఖిల.

"చెపుతాను. అయితే, మీరు అన్యథా భావించకూడదు. ఇన్ని రోజులుగా నన్ను చూస్తున్నారు కనక సరిగానే అర్థం చేసుకుంటారని నా ఆశ. నేను ఊరికి వెళ్ళగానే ఎటూ పైకి చదవ దలుచుకోలేదు కనక పెండ్లికి వాయిదా వేయటానికి వీలు లేదు. మీకు అభ్యంతరం లేకుంటే పెద్ద వారి దగ్గర మీ గురించి చెపుతాను" అన్నాడు.

ఏమీ మాట్లాడలేక పోయింది అఖిల. కాలేజీలో పెద్ద పరిచయం లేని ఈ వ్యక్తి, గంభీరంగా ఉన్న వ్యక్తి, ఇంత చొరవగా అడిగేటప్పటికి ఏం చెప్పాలో తెలియలేదు. అతని రూపం, వ్యక్తిత్వం తనను ఆకర్షించినా, ఈ విధంగా కలుసుకుంటారని కాని, అతను ఇంత చొరవగా అడుగుతాడని కాని తాను ఊహించలేకపోయింది. పైగా వివాహ ప్రసక్తి వచ్చేటప్పటికి తెలియకుండా రవంత సిగ్గు ఆవహించింది.

కొంచెం సేపు ఆగి, అప్పటికీ ఆమె మౌనం వీడకపోవటంతో, "మీ మనస్సు నొప్పించానేమో, క్షమించండి. మన ఇద్దరి మనస్తత్వాలకూ విరుద్ధం కనక కాలేజీలో మీ పరిచయం పెంచుకోలేదు. కాని, ఇన్నేళ్ళుగా మీ స్వభావాన్ని పరిశీలిస్తూనే ఉన్నాను. మీ సాహచర్యంతో మన జీవితాలు సుఖప్రదమౌతాయని నేను నమ్ముతున్నాను. మళ్ళీ కలిసే అవకాశం లేదు కనక మిమ్మల్ని అడుగుతున్నాను. మీకూ ఆ నమ్మకం ఉంటే చెప్పండి. పెద్దవాళ్ళు మాట్లాడుకునే ఏర్పాటు చేస్తాను" అన్నాడు.

ఆమె పెదవులు ఆమె మాట విని కూడా మాట్లాడలేమన్నట్లు వణికి ఊరుకున్నాయి. ప్రసాద్ ఒక్క క్షణం ఆగి, "పోనీ, మీరు ఆలోచించుకోవాలనుకుంటే తొందర లేదు. నేను మళ్ళీ ఆదివారం సాయంత్రం ఇక్కడికి వస్తాను. మీకు అభ్యంతరం ఉంటే రాకండి. నా కర్థం అవుతుంది" అన్నాడు.

అప్పటికి తేరుకుని ఒక నిర్ణయానికి వచ్చిన అఖిల—"నేను ఆలోచించ వలసింది ఏమీ లేదు. మీరే కొంచెం నిదానంగా ఆలోచించ వలసి ఉంటుంది. నా వివాహం విషయంలో నా నిశ్చయం మీకు తెలుసు ననుకుంటాను" అన్నది.

"అంటే, కట్నం ప్రసక్తి ఉండ కూడదనే కదూ?" అన్నాడు నవ్వుతూ ప్రసాద్.

"అవును. పైగా మా కుటుంబ పరిస్థితులు మీకు తెలియాలి కదా? వినండి. మా నాన్నగారికి మేము ముగ్గురం ఆడపిల్లలం. మా నాన్నగారు యూనివర్సిటీలో హెడ్‌క్లర్క్. ఒక్క ఇల్లు మాత్రమే మాకు ఉన్న ఆస్తి. కుటుంబ నిర్వహణలో, మా చదువులతో నిలవ ఏమీ లేదు. కట్నం అంటే ఇంటిమీద అప్పు తేవాలి. అంటే, మా వివాహాలు అయేటప్పటికి మా నాన్నగారికి ఇల్లు ఉండదు. అభిమానధనులయిన నాన్నగారు ఆడపిల్లల దగ్గర ఉండరు. కనక ఆడపిల్లలను కనటమే ఒక అపరాధమై దానికి శిక్షగా నా తండ్రి నిరాధారులు కావటం నేను ఏమాత్రం సహించలేను. మరొక ప్రబల కారణం చెపుతాను, వినండి. స్వబుద్ధి, స్వయం శక్తి కలిగి, ప్రేమాభిమానాలు, భార్య పట్ల అయినా సరే ఇచ్చి పుచ్చుకోవలసినవిగా తెలుసుకొనగలిగిన వ్యక్తినే నేను భర్తగా అంగీకరిస్తాను; గౌరవిస్తాను. నేను తెచ్చిన డబ్బుతో నన్ను పోషిస్తాననే వ్యక్తి నా దృష్టిలో తృణప్రాయుడు. ధర్మబద్ధమైన వివాహానికి డబ్బు బేస్ కారాదు. ఇది నా నిశ్చితాభిప్రాయం. దీనిని మీరు దురభిమానంగా భావించకుంటే. . .

"లేదు. . . లేదు. మీ పితృ భక్తికీ మీ స్వాభిమానానికి మిమ్మల్ని అభినందిస్తున్నాను. మరి. . ."

"నా అభిప్రాయం చెప్పాను. మరొక సంగతి. దీనికి మీ పెద్ద వారుకూడా మనఃస్ఫూర్తిగా, సంతోషంగా అంగీకరించే పక్షంలోనే పెద్దవాళ్ళు మాట్లాడుకునే ఏర్పాటు చేయండి" అన్నది.


"థాంక్స్!" అన్నాడు ప్రసాద్ సంతృప్తిగా.

o o o

మంచి రోజు చూచుకుని ప్రసాద్ తండ్రి సుబ్బారాయుడు, తల్లి సుందరమ్మ, ప్రసాద్, ఇంటి పురోహితుడు వచ్చి, అఖిలను చూచుకుని వెళ్ళారు. తరవాత పురోహితుడు వచ్చి మాట్లాడతానని చెప్పి వెళ్ళారు సుబ్బారాయుడుగారు. అయిదారు రోజుల తరవాత పురోహితుడు వచ్చి ముహూర్తం పెట్టి వెళ్ళాడు.

## చలి ప్రొద్దు

పులిచెర్ల సాంబశివరావు (గుంటూరు)



ముహూర్తం చాలా దగ్గరలో ఉండటం వలన పెళ్ళి హడావిడిలో వచ్చారు.

రాత్రి పది గంటలకు ముహూర్తం. కళ్యాణ మండపం కళకళలాడుతూ సందడిగా ఉన్నది. అఖిల చుట్టూ స్నేహితులు చేరారు.

"అఖిలా! కాలేజీలో ఎప్పుడూ పరిచయం చేసుకున్నట్లు కూడా లేదు. ఎప్పుడు మాట్లాడుకున్నారే?" అన్నది మాలతి.

"బాగా ఆస్తి ఉన్న వాడు, అపర శ్రీరామచంద్రుడు, పైసా కట్నం లేకుండా చేసుకుంటున్నాడంటే అఖిల అదృష్టవంతురాలు" అన్నది అనిత.

"అఖిలను చేసుకుంటున్నందుకు అతడే అదృష్టవంతుడు. కట్నం కోసం చూసుకుంటే ఇలాంటి కుందనపు బొమ్మ దొరుకుతుందా?" అన్నది కుముద.

"ఏమైతేనేం? పంతం నెగ్గించుకున్నది" అన్నది పార్వతి.

అఖిల పెదవుల మీద గర్వంతో చిన్న హాస రేఖ మెరిసింది. ఇంతలో అఖిల తల్లి వచ్చి—"పార్వతీ! విడిదికి పోయి ఆడవాళ్ళకు ఏమైనా కావాలేమో కనుక్కున్నిరా, అమ్మా. అక్కడ అన్నీ ఉన్నాయో, ఏమైనా వస్తువులు పెట్టటం మరిచామో చూచిరా" అని పురమాయించింది. పార్వతికి తోడుగా మాలతి వెళ్ళింది.

ఇద్దరూ పావుగంట తరవాత వచ్చారు కాని, వచ్చిన తరవాత వారిలో ఉత్సాహం తగ్గినట్లు గమనించింది అఖిల. ఎందుకో అర్థం కాలేదు.

"పార్వతీ! అలా ఉన్నారేమే! మాలతీ! పెళ్ళివారు ఏమైనా అన్నారా?" అన్నది అఖిల ఆత్రతగా.




"ఛ ... ఛ! మమ్మల్ని ఎందు కంటారు? ఏమీ అనలేదు" అన్నది పార్వతి.

"నేను నమ్మను. మాలతీ! నీవు చెప్పు. ఏం జరిగింది?"

"మరి. . ." మాలతి మాటను మధ్యలోనే తుంచి, "ఆ. ఏమిటి? మరిట... మరి! నువ్వు కాస్త నోరు మూసు కుంటావా, మాలా! అఖిలా! నువ్వు అనవసరంగా ఏదో ఊహించుకుని ఫీల్ అవ్వకు. మేము మామూలు గానే ఉన్నాం" అన్నది పార్వతి.

"కాదు, ఏదో ఉంది. చెప్పకపోతే నా మీద ఒట్టే" అన్నది అఖిల, గభాల్న పార్వతి చెయ్యి తన తల మీద పెట్టుకుని.

పార్వతి తన చెయ్యి లాక్కుని, "ఛ...ఛ! నీ కసలు బుద్ధుందా! ఈ ఒట్టేమిటి ఇప్పుడు?" అన్నది మందలిస్తూ.

"ఒట్టు పెట్టుకున్నాను. మాలతీ! నువ్వు చెప్పు."

"ఏమీ లేదు. కట్నం పది వేలేననీ, ఎక్కువయినా అమ్మాయి నచ్చింది కనక చేసుకుంటున్నామనీ మీ మామగారు ఎవరో బంధువులతో చెప్తున్నారు."

నిర్ఘాంతపోయింది అఖిల. "కట్నం లేదంటే అవమానం అనుకొని అలా చెప్పి ఉంటాడు" అన్నది పార్వతి సర్ది చెప్తూ.

'ఏదైనా ఒకటే' అని అఖిల మనస్సు ఆక్రోశించింది. చరచర హాలులోకి వెళ్ళి హడావిడిగా తిరుగుతున్న తండ్రిని పిలిచింది. పక్క గదిలోకి తీసుకు వెళ్ళింది.

"ఏమిటమ్మా! ఏం కావాలి?"

"ఏమీ అక్కర లేదు, నాన్నా! ముందు ఇది చెప్పండి. మీరు వాళ్ళకు కట్నం ఇస్తున్నారా?"

"లేదమ్మా. ఇవ్వటం లేదే! ఎవరు చెప్పారు?"

"నాన్నా! మీరు మాకు చిన్నప్పటి నుండీ అబద్ధం చెప్పటం తప్పని చెప్పి ధైర్యంగా నిజం చెప్పటం అలవాటు చేశారు. మీరే ఈ రోజు అబద్ధం చెప్తున్నారా?"

"తల్లీ, అఖిలా! నీకు మా అమ్మ పేరు పెట్టుకున్నాను. అందుకనే నిన్ను 'అమ్మా!' అని పిలుచుకుంటాను. నీ ముందు ఒప్పుకోవటానికి నాకు బాధ లేదమ్మా. ఇలాంటి సమయం వస్తుం దని నాకు తెలుసు. అన్నీ నీకు వివరంగా చెప్తాను, కూర్చో" అంటూ అఖిలను కూర్చోబెట్టి తానూ కూర్చున్నాడు.

"చూడు, తల్లీ! నువ్వు చిన్న పిల్లవు. ఆవేశం తప్ప అనుభవం లేదు. సమా జంలో అంతటా ఉన్న వరకట్నం మనం ఒక్కరం కాదంటే పోతుందా? అయినా, వాళ్ళు అడగలేదమ్మా. లోకాచారాన్ని బట్టి నేనే ఏదో నా సంతోషం కొద్దీ ఇస్తానని అన్నాను."

మాట పూర్తి కానివ్వలేదు అఖిల. "ఇది మరొక అబద్ధం. ఇప్పుడు మీరు పది వేలు అప్పు చేసి అయినా ఇవ్వటం సంతోషంగా ఇవ్వటమా? పైగా నన్ను చిల్లి పిల్ల నంటున్నారా! ఇది నా ఆత్మాభిమానానికి సంబంధించిన విషయ మని మీకు అనేక పర్యాయాలు చెప్పాను. అయినా, మీ రిలా నన్ను వంచిస్తారనుకో లేదు. ఇది నేను ఏమాత్రం సహించను" అన్నది తీవ్రంగా.

"పిచ్చి తల్లీ! ముగ్గురు ఆడపిల్లల తండ్రిని నేను కట్నం ఇవ్వనూ అంటే పిచ్చి వాడికింద జమ కడతారు. అమ్మా, అఖిలా! నీకు నా మీద ఏమాత్రం ప్రేమ ఉన్నా ఇది నిర్విఘ్నంగా జరిగిపో నివ్వు. నా గుండెలో చిచ్చు పెట్టకు. నీ అభిమానం నాకు తెలుసు. అయినా, వీళ్ళు వచ్చి చూసుకుని వెళ్ళాక పురో హితుని చేత కబురు చేస్తామన్నారు కదూ? వీళ్ళ పురోహితుడు నాకు ఆఫీసుకు వచ్చి ఇచ్చిన ఉత్తరం చూడు" అంటూ ఉత్తరం తెచ్చి ఇచ్చాడు తండ్రి. తీసుకుని చదవసాగింది అఖిల.

"మహారాజరాజశ్రీ బావగారికి, నమ స్కారములు. ఉభయ క్షేమానంతరం...

మీ అమ్మాయి కేవలమూ మహా లక్ష్మి స్వరూపముగా ఉండి మాకు నచ్చిన దని వ్రాయుటకు చాలా సంతోషముగా ఉన్నది. అటువంటి విద్యావతి, రూపవతి మాకు కోడలుగా వచ్చుట మాకూ మిక్కిలి సంతోషము.

అమ్మాయిని గూర్చి అబ్బాయి చెప్పినప్పుడు అమ్మాయి కట్న మిచ్చు టకు ఏమాత్రమూ ఇష్టపడదనీ, కనక కట్నము అసలు అడగవద్దనీ, తాను మీ అమ్మాయిని తప్ప మరెవరినీ చేసుకోననీ చెప్పినాడు.

మా అబ్బాయికి ముప్పయి వేలు కట్న మిస్తామని వచ్చుచున్నారు. మాకు మీ అమ్మాయి నచ్చినప్పటికీ, కట్నము లేకుండా చేసుకున్న ఎడల గ్రామము లోనూ, బంధువర్గములోనూ మాకు మర్యాదకు లోపముగా ఉండును. కావున మీ శక్తినిబట్టి మీరు ఇచ్చినచో మీ అమ్మాయిని మా అబ్బాయికి చేసు కొనగలము. మనకు పిల్లల సుఖ, సంతోష ములే ప్రధానములు కదా అని నేను భావించితిని. మీరును ఆలోచించ గలరు. ఇట్లు...

—సుబ్బారాయుడు వ్రాలు."

"చూశావు కదమ్మా ఈ ఉత్తరం? ఏం చేయమంటావు, చెప్పు! యోగ్యుడూ, ముఖ్యంగా నీ వంటే ఇష్టపడిన వాడూ, నీవు ఇష్టపడిన వాడూ—అటువంటి వరుడిని ఈ కట్నం గురించి మానుకో గలనా? పైగా వాళ్ళు ఇంత అని అడగ లేదు. ఎంత మంచి వాళ్ళో చూడు? నీ సుఖానికి ఉపయోగపడని ఈ డబ్బు నాకు శాంతినిస్తుందా, చెప్పు! ఈ తండ్రి మనస్సు అర్థం చేసుకో" అంటూ అఖిల చేతులు పట్టుకున్నాడు లాలనగా.

"అతనికి తెలుసా కట్నం ఇస్తు న్నట్లు?" అన్నది అఖిల.

"తెలును. బహుశా తండ్రి మనకు ఉత్తరం పంపిన తరవాత తెలిసి ఉంటుంది."

కొంచెం సేపు మౌనంగా ఉండి, "సరే, నాన్నా! అలాగే జరగనివ్వండి" అంది.

ఆమె గొంతులోని కాఠిన్యాని తండ్రి కంగారు పడ్డాడు.

"తల్లీ, అఖిలా! నీవు నా ప్రాణంతో సమానం. నీవు మరీ మనస్సు సరిపెట్టుకో లేకపోతే ఇప్పుడే చెప్పు. ఏమైనా ఫరవా లేదు. ఇప్పుడే విరమించుకుందాము. అంతేకాని. . ."

"అంత బలహీనురాల్ని కాదు, నాన్నా! మీ తృప్తికోసం ఇదిగో ప్రమాణం చేస్తున్నాను. మీరు వెళ్ళి నిశ్చింతగా పనులు చేసుకోండి" అన్నది తండ్రి చేతిలో చెయ్యి వేసి.

ప్రేమతో కూతురి తల నిమిరి వెళ్ళి పోయాడు.

* * *

గదిలోకి వచ్చి తలుపు వేసి, తల ఎత్తి చూశాడు ప్రసాద్. అగరువత్తుల ఘుమ ఘుమ ఘ్రాణేంద్రియాలకు మత్తు కలిగిస్తున్నది. గదిలో ప్రతి అంగుళం అందంగా అలంకరించబడి ఆహ్లాదం కలిగిస్తున్నది. ముఖంపై వెన్నెల కిరణాలు తళతళలాడుతూండగా బయ టకు చూస్తూ కిటికీవద్ద నిలబడి ఉన్నది అఖిల. ఆమె అందం ప్రత్యేకపు అలంకరణతో మరింత నయనానంద కరంగా ఉన్నది. "అఖిలా!" పిలుపు విని ఒక్క క్షణం తరవాత తల ఎత్తి చూచింది అఖిల. నివ్వెరపోయాడు ప్రసాద్.

ఆమె విశాల నేత్రాలు అరుణిమ దాల్చి ఉన్నాయి. దుఃఖాన్ని అణచి వేసిన చిహ్నంగా కనురెప్పలు రవంత ఉబ్బి ఉన్నాయి. చూపులు బాణాల్లాగా, దూసుకుని వస్తున్నాయి. ఆ చూపులలో ఎంత నిరసన! వివాహ వేదిక మీదనే ఆమె ముఖంలోని బాధ గమనించాడు. ఇక ఇప్పుడు ఆమెను తాకి అనునయించ టానికి సాహసించ లేకపోయాడు ప్రసాద్. ఆత్మాభిమానం కల అఖిలకు ఇది ఎంత బాధాకరమో తెలుసు. అందుకనే తప్పు ఒప్పుకుంటూ, "క్షమించు, అఖిలా!" అన్నాడు.

'ఎంత తేలిక మాట!' అన్నాయి ఆమె కళ్ళు. కుంచించుకుపోయింది ప్రసాద్ మనస్సు.

"నీవు అంత చెప్పినా నీ మాట ప్రకారం జరపలేకపోయాను. నీ దృష్టిలో తక్కువ అయి పోయినా, నిన్ను వదులుకోలేని స్వార్థపరుణ్ణి."

"స్వార్థం. హుఁ. మీకు ఇష్టమైన భార్య కావాలి. మీ నాన్నగారికి నచ్చిన కోడలు ప్లస్ కట్నం కావాలి. మా నాన్నకు కూతురనే గుండె మీది బరువు దిగి పోవాలి. ఎవరి స్వార్థం వారిది. ఆడదాన్ని కనక నాకు ఒక మనసంటూ ఉండదా,



'అసలు ఈ అమ్మాయి వైఖరి గుణమే ఇంతా! ప్రసాద్ పొరపడ్డాడా? తన అంచనా తప్పయిందా!' అని బాధపడ సాగాడు.


తండ్రి పండగకు పిలవటానికి వస్తే తండ్రితోకూడా ఆత్మీయంగా మాట్లాడలేదు అఖిల. "ఆడపిల్లకు కట్న కానుకలు ఇచ్చి, పెళ్ళి చేసి పంపారు కదా? అది చా''లని సన్నగా దెప్పి ఇప్పట్లో రావటం పడదని ముఖావంగా చెప్పి నిరాకరించింది. అఖిల తన తండ్రితో కూడా ఆ విధంగా ప్రవర్తించటంతో ఆమె ప్రవర్తనకు కారణం ఊహించుకో గలిగాడు సుబ్బారాయుడు.

మరి కొన్ని రోజులు గడిచినా అఖిల ప్రవర్తనలో మార్పు రాలేదు. ఎవరైనా వచ్చినప్పుడు మాత్రం ఎంతో నమ్రతగా, చిరునవ్వుతో ప్రవర్తించేది. ఈ ద్విపాత్రాభినయానికి బాధపడాలో, అందరి ముందు పరువు తీయనందుకు సంతోషించాలో అత్త మామలకు తెలియ లేదు. సుందరమ్మ కోడలుకు చిన్నగా చెప్పి చూచింది. కనుబొమలు భయంకరంగా ముడి పడటం తప్ప పడక మార్చుకపోవటంతో, ఇక మనస్సు ఆగక భర్త చెవిలో ఊదింది. సుబ్బారాయుడి నెత్తిమీద పిడుగు పడినట్లయింది. చదువుకున్న పిల్ల. ఈ విషయం ఆమెకు ఎవరు, ఎట్లా చెప్పగలరు? అసలు ఈ విషయం ఆమె ముందు మాట్లాడటం ఎలా?

రాత్రి తన గదిలోకి ప్రసాద్ని పిలిచి, "బాబూ, ప్రసాద్! ఏమిట్రా ఇది?" అన్నాడు. తండ్రి ఏ విషయం అడుగుతున్నాడో ప్రసాద్కు అర్థం అయింది. మరింత బాధగా ముఖం పెట్టి, "మీ పరువు ప్రతిష్ఠలకు నేను చెల్లిస్తున్న మూల్యం, నాన్నా! ఏం చేయమంటారు, చెప్పండి! మీ తల్లిదండ్రులుకూడా మనఃస్ఫూర్తిగా నా అభిప్రాయాన్ని అంగీకరిస్తేనే పెళ్ళి చూపులకు రండని ఆనాడే చెప్పింది. మీకు నేను గట్టిగా చెప్పినా వినిపించుకో కుండా ఇంత చేశారు. అటు తండ్రి, ఇటు మామ తనను మోసంచేసి, వంచించారని తన మనస్సు కష్టం. ముందుగా నేనే బయట పడి, తనను అడిగి, పట్టు పట్టి వివాహం చేసుకున్నందుకు తప్పు నాది కనుక శిక్ష కూడా అనుభవించాలి కదా?" అని వెళ్ళిపోయాడు.

ఆ రాత్రంతా సుబ్బారాయుడికి నిద్ర పట్టలేదు. ఈ సమస్య ఎలా పరిష్కరించాలో నిర్ణయించుకోలేకపోయాడు. పొద్దున్నే లేచి పొలం వైపు వెళ్ళాడు.

ఆయన తిరిగి వచ్చే వేళ కనిపెట్టి ముందు చావిడిలోకి వచ్చి కూర్చున్నది అఖిల. వీధి వాకిలి దాటి లోపలకు అడుగు



ఒంటరితనం

పెట్టిన సుబ్బారాయుడు కాలు మీద కాలు వేసుకుని, కుర్చీలో వాలి పేపరు చదువుతున్న అఖిలను చూచి నిర్ఘాంత పోయాడు. ఆ చావిడి తాను, ఊరి పెద్దలు, మగవాళ్ళు కూర్చుని మాట్లాడు కునే చోటు. తరతరాలుగా తమ ఇంట్లో కొంత ఘోషా పద్ధతి ఉన్నది. ఆడవాళ్ళు చావిడిలోకి రావటం అంటూ ఇప్పటికి జరగలేదు. స్త్రీల రాకలు, పోకలు దక్షిణ ద్వారం గుండానే జరుగుతాయి. 'ఒకవేళ తెలియక కూర్చున్నదేమో' నని మనస్సు సర్దుకుని, "అమ్మా, అఖిలమ్మా! ఇక్కడ కూర్చోకూడదు. లోపలికి వెళ్ళమ్మా" అన్నాడు.

"ఏం?" అని ఎదురు ప్రశ్న వచ్చింది.

"మన ఇంట్లో ఆడవాళ్ళు బయటకు వచ్చే అలవాటు లేదు. నీవు చావడిలో కూర్చుని ఉండగా ఎవరైనా చూస్తే నా పరువు పోతుందమ్మా. నా మాట విని లోపలికి వెళ్ళు" అన్నాడు సుబ్బారాయుడు వినుగ్గా.

"అరెరె! అదేమిటి, మామయ్యా! మీ పరువు ప్రతిష్ఠలను మా నాన్న శ్రమ బిందువులతో అభిషేకించి, నా ఆత్మాభిమానాన్ని పస్తు మేక లాగా బలి ఇచ్చి పది వేలు పెట్టి కట్నేసి, ఇనప్పెట్టెలో బంధించాం కదా? అది ఎక్కడికి పోతుంది? అంత మూల్యం చెల్లించిన నాకు ఇంట్లో ఇష్టమైన చోట కూర్చోవటానికీ, ఇష్టమైనట్లు ప్రవర్తించేందుకూ వీలు లేదా?"

ఛెళ్ళున కొరడా పెట్టి కొట్టినట్లయింది సుబ్బారాయుడికి. ఇంత తెగించి, నిర్మొహమాటంగా మాట్లాడుతుందని అనుకోలేదు.

"ఎంత ధైర్యం నీకు? నన్నే ఎదిరిస్తున్నావా? వచ్చినప్పటి నుంచీ చూస్తున్నాను. కట్నం తెస్తే మాత్రం అంత నిర్లక్ష్యమా?"

"ఒకరు నిర్లక్ష్యం చేస్తే రోషం కలిగిన వాళ్ళకు ఇతరుల ఆత్మాభిమానాన్ని గౌరవించటంకూడా తెలియాలి. 'నన్నే ఎదిరిస్తున్నావా' అన్నారే? డబ్బు తోటి, మిథ్యా గౌరవాల తోటి నిలిచే గౌరవం ఏ పాటిది? పెద్దవారు మీరు. పిల్లలు తప్పు చేస్తే దండించి, సరిదిద్ది సత్ప్రవర్తన మంచి పనులకు చేయూత నిచ్చినప్పుడే మీకు గౌరవం. మొదటే మీ అబ్బాయికి గట్టిగా చెప్పాను కనక మీరు మొదట మా ఇంటికి వచ్చినప్పుడు ఎంతో ఆనందించాను. మన కుటుంబం ఆదర్శ ప్రాయమవుతుందని, సహృదయులైన మీకు కోడల్ని కావటం నా అదృష్ట మని భావించాను. కాని, మీరు చేసింది ఏమిటి? నా ఆశయాలూ, ఆశలూ భగ్నమయిపోయి, నా ఆత్మాభిమానం నాశనమైనప్పుడు ఇక మిమ్మల్ని ఎలా గౌరవించగలను? ఏం ముఖంపెట్ట గలను. నే నేమి సుఖపడగలను?" అన్నది అఖిల రోషంగా.

రోషంతో కందగడ్డ అయిన ముఖం, ఆత్మాభిమానంతో, ఆత్మవిశ్వాసంతో తళతళ లాడుతున్న కళ్ళు, నిజాయితీ, నిష్కపటత ప్రతిధ్వనిస్తున్న కంఠధ్వని. అఖిలను చూస్తూ ఒక్క క్షణం నిలబడి పోయాడు సుబ్బారాయుడు. మరు నిమిషంలో తేరుకుని చరచర లోపలికి వెళ్ళాడు. అతని మనస్సు గుంజాటన మాని ఒక నిర్ణయానికి వచ్చింది.

మాటా పలుకూ లేకుండా మామ గారు లోపలికి వెళ్ళటం చూచి పర్యవసానం కోసం ఎదురుచూస్తూ ఆలోచిస్తున్నది అఖిల. లోపలికి వెళ్ళిన సుబ్బారాయుడు నోట్ల కట్టలతో హాల్లోకి వచ్చి, "ప్రసాద్!" అని గట్టిగా పిలిచాడు. బయటకు వచ్చాడు ప్రసాద్.

"ఇదిగో పది వేలు. వెళ్ళి మీ మామ గారికి ఇచ్చేసిరా" అన్నాడు. క్షణం ఏమీ మాట్లాడలేక పోయాడు ప్రసాద్.

"కోపంతో ఈ పని చేయకండి, మామయ్యా! మీకు కోపం తెప్పించటం నా ఉద్దేశ్యం కాదు" అన్నది అఖిలకూడా హాల్లోకి వచ్చి.

"లేదమ్మా, లేదు. ఇది కోపంతో కాదు, మనఃస్ఫూర్తిగా చేస్తున్న పని. ఆడవాళ్ళ పట్ల నా కున్న అభిప్రాయాన్ని మార్చి, నా కళ్ళు తెరిపించావు. నీ ఆత్మాభిమానానికి నేను ఎంతో సంతోషిస్తున్నానమ్మా. గృహలక్ష్మివి—నీకు దుఃఖ హేతువయిన ఈ డబ్బు, నా కొడుకు సుఖాన్ని పాడు చేస్తున్న ఈ పాపిష్ఠి డబ్బు నాకు అక్కర లేదు. అత్త వారి ఇంటికి వస్తూ పుట్టింటి అరణంగా కొంత ధనం తీసుకు రమ్మంటే తప్పేమి టనుకునే వాడిని. కాని, ఇన్నాళ్ళైనా వస్తూ తేవలసిన ధనం ఏమిటో అర్థమయింది. నీ అభిమానధనమే నిజమైన పెద్ద కట్నం. ఈ కట్నపు డబ్బుతో కాదు, నీ ప్రవర్తన వల్లనే ఇంటికి పరువు ప్రతిష్ఠలు వచ్చేది" అన్నాడు సుబ్బారాయుడు. ప్రసాద్ గుడ్డలు మార్చుకుని వచ్చి డబ్బు తీసుకుని వెళ్ళిపోయాడు.

"మీ మనస్సు నొప్పించా నేమో! నన్ను మన్నించండి, మామయ్యా!" అన్నది అఖిల వినయంగా.

"లేదమ్మా. నన్నేమీ నొప్పించ లేదు. కాలానుగుణంగా మారకుండా డబ్బు కోసం, మిథ్యా గౌరవాల కోసం మూర్ఖంగా ప్రవర్తించే పెద్దవాళ్ళకు ఇలా చేసి అయినా తెలియచెప్ప వలసిందే. ఇక మన్నించ మన్నావు కదూ? ప్రసాద్ పొలం పనుల బాధ్యత తీసుకున్నప్పటి నుంచీ ఏమీ తోచడం లేదు. తోడుగా త్వరలో ఒక మనుమణ్ణి. . ."

మాట పూర్తి కాకుండానే సిగ్గుపడి లోపలికి వెళ్ళిపోయింది అఖిల. నవ్వుకుంటూ రేడియో ఆన్ చేశాడు సుబ్బారాయుడు. పాట వస్తున్నది.

"పుట్టింటి అరణాలు, ఘనమైన కట్నాలు అత్త వారింటి నిండ వేసినా, అవి అభిమానమంత విలువ చేయునా. . ."

*